సన్నాహక రథయాత్ర



ఇస్కాన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో రథయాత్ర

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించ బోయే పూరి జగన్నాథ రథయాత్ర ఏర్పాట్లలో భాగంగా మంగళవారం రథయాత్ర ట్రయల్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నెల్లూరుకు ఇస్కాన్ అధ్యక్షుడు సుఖదేవ్ మహారాజ్ పర్యవేక్ష ణలో షార్ బస్టాండ్ నుంచి శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ సమీపంలోని శ్రీనగర్ కాలనీ వరకు రథయాత్రను నిర్వహించారు. ట్రయల్ రన్‌లో ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధులతో పాటు పట్టణ ప్రముఖులు పాల్గొని హరేరామ హరేకృష్ణ నామ స్మరణలతో నిర్వహించారు.

పశుగణాభివృద్ధిపై అవగాహన

కలువాయి(సైదాపురం) : పశుగణాభివృద్ధిపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధికారి శ్రీని వాసులు కోరారు. మండల కేంద్రమైన కలువా యిలోని పశువైద్యశాలలో మంగళవారం పలు పథకాలపై రైతులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఎల్‌డీఏ ద్వారా పాడి రైతులకు వివిధ పథకాలను ప్రభుత్వం మంజూరు చేసిందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్ జీఎం ద్వారా మారుమూల ప్రాంతాల్లో 20 వేల కుపైగా దున్నపోతులను పాడి రైతులకు ఉచితం గా అందిస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది గురు జయంతి, కృష్ణమోహన్ తదిత రులు ఉన్నారు.

వేధింపులపై కేసు నమోదు

కోట : మండలంలోని చంద్రశేఖరపురం గ్రామా నికి చెందిన రజనీ అనే వివాహిత తన భర్త దిలీప్ అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నట్లు మంగళవారం ఎస్ఐ పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంతా మా ఇష్టం.. ధరలు చెప్పం!

జిల్లాలో పళ్ల గుజ్జు పరిశ్రమదారులు సిండికేట్ అయ్యారు. మామిడి రేటును చెప్పకుండా నాన్చుతున్నారు. ఇన్నాళ్లూ రూ.8 నుంచి రూ.5 వరకు పాటపాడారు. తీరా కూటమి ప్రభుత్వం పరువుపోతోందని నోటిమాటగా అమలవుతున్న మద్దతు ధరకు తాళం వేసే శారు. దీని దెబ్బకు రెండు రోజులుగా మామి డిరేట్లు మూగబోయాయి. రైతులకు ఇస్తున్న బిల్లుల్లో తూకం వివరాలు మాత్రమే దర్శనమి స్తున్నాయి. ధర వివరాలను ప్రస్తావించకపోవ డంతో రైతులు అయోమయంలో పడ్డారు.

జిల్లాలో మ్యాంగో ఫ్యాక్టరీలు సిండికేట్

- ఇన్నాళ్లు తోతాపురి కిలో రూ. 8, రూ.6, రూ.5 అంటూ ప్రచారం
- ప్రస్తుతం ధరలు చెప్పని వైనం
- అయోమయంలో రైతులు



కాణిపాకం/తిరుపతి రూరల్ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 43 మామిడి గుజ్జు పరిశ్రమలున్నాయి. ఇందులో 31 ఫ్యాక్టరీలు తెరుచుకున్నాయి. ఇవీ ఈనెల 6 నుంచి తోతాపురి కొనుగోలును ప్రారం భించాయి. ఫ్యాక్టరీలు తోతాపురి కేజీ రూ.8కి కొను గోలు చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం తరఫున కేజీకి రూ.4 చొప్పున రైతులకు ప్రోత్సాహక నిధి ఇస్తామని పాట పాడింది. ఫ్యాక్టరీలు టోకన్లు జారీచేసి కాయలు కొనుగోలు చేసేందుకు శ్రీకారం చుట్టాయి. అయితే ఈటోకన్ల జారీ గందర గోళంగా మారడంతో ఫ్యాక్ట రీలు చేతులెత్తేశాయి. మధ్యలో పోలీసులు, అధికా రులు కల్పించుకుని రైతులందరికీ టోకెన్లు ఇప్పించే ప్రయత్నాలు చేశారు.



తిరుచానూరు : మామిడికాయలను పారబోసిన రైతులు

కొనేవారేరీ?

టోకన్ల గోల ముదరడంతో అధికారులు కొత్తపల్లవి అందుకున్నారు. ఇకపై టోకన్లు అవసరం లేదని ప్రకటించారు. కాయలు కోత కోసి ఫ్యాక్టరీ వద్దకు తీసుకెళితే తీసుకుంటారని ప్రచారం చేస్తు న్నారు. ఈ ప్రచారంతో ఫ్యాక్టరీలు కాయలు కొనలేమని బోర్డులు పెట్టేస్తున్నాయి. కాయలు కోసి తెచ్చిన వారిని తిప్పి పంపిచేస్తున్నాయి. లేకుంటే ఐదు రోజుల తర్వాత వరస నంబరు వేసి రైతు ఫలాన్ని మట్టిపాలు చేస్తున్నాయి. సిఫార్సులుంటే అప్పటికప్పుడే దింపుకుంటున్నాయి. మామిడి విపత్తును అదునుగా తీసుకుని ఫ్యాక్టరీలు సిండికేట్ అయ్యాయి. మామిడి రైతులను దెబ్బ తీసేందుకు కుట్రలు పన్నుతున్నాయి.

ధర ఎంత?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13 వేల మంది రైతుల వరకు సుమారు 1.5 లక్ష టన్నుల మామిడి కాయలు ఫ్యాక్టరీకి తరలించినట్లు అధికారులు చెబుతున్నారు. వీరిలో తొలుత వచ్చిన రైతులకు ఫ్యాక్టరీ నిర్వాహకులు తోతాపురి కేజీ ధర రూ.8ని రుచిచూపించారు. కొన్ని రోజుల తర్వాత వచ్చిన రైతులకు కేజీ ధర రూ.6ని తీసుకున్నారు. మరికొన్ని రోజుల తర్వాత వచ్చిన రైతులకు రూ.5ని చెప్పి ముఖం చాటేశారు. ఇప్పుడు ఫ్యాక్టరీలు రైతులకు పెద్ద షాక్ ఇస్తున్నాయి. తోతాపురి ఎంతకు కొనుగోలు చేస్తున్నాయో చెప్పడం లేదు.



జాతీయ రహదారి పక్కన మామిడిని పడేసిన పదిపుట్ల బైలుకు చెందిన రైతు

గుండె గు'బిల్లు'

ఈనెల 6వ తేదీ నుంచి ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ఏ ఒక్కరైతుకు కూడా బిల్లులో ఫ్యాక్టరీలు ధరల విషయాన్ని ప్రస్తావించ లేదు. కేవలం కాయలు, ట్రాక్టర్ లోడింగ్‌తో సహా ఎంత బరువు ఉంది.. ఖాళీ ట్రక్కుతో ఎంత బరువు ఉంది.. అని మాత్రమే బిల్లుల్లో ప్రస్తావిస్తున్నారు. ధర విషయాన్ని ఖాళీగా చూపుతున్నారు. ధరలు చెప్పకపో వడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.



ఫ్యాక్టరీలో మామిడి కాయల క్లీనింగ్ టబ్



గుజు ప్యాకింగ్



దామల చెరువు మండీల వద్ద చెత్త కుప్పల్లో పడేసి వెళ్లిన మామిడి పండ్లు

బారులు తీరిన ట్రాక్టర్లు

గుడిపాల సరిహద్దులోని ఓ ఫ్యాక్టరీ నుంచి తమిళనాడులోని కాట్పాడి కింగ్‌స్టన్ కాలేజీ వరకు మామిడి కాయల ట్రాక్టర్లు క్యూకట్టాయి. గత మూడు రోజులుగా ఈ సమస్య తీవ్రతర మవుతోంది. అన్‌లోడింగ్‌కు రైతులు రోడ్డుపైనే కాపు కాస్తున్నారు. తిండీలేక తిప్పలు పడు తున్నారు. గుడిపాలలోని కొత్తపల్లి వద్ద ఇదే పరిస్థితి ఎదరవుతోంది. జీడీనెల్లూరు మం డలం ఎట్టేరి వద్ద ఉన్న ఫ్యాక్టరీ వద్ద కూడా మూడు కి.మీ మేర ట్రాక్టర్లు నిలిచిపోయాయి. ఇక్కడ కాయలు అన్‌లోడింగ్‌కు ఐదు రోజులకు పైనే పడుతోంది. దీని దెబ్బకు ఆయా ఫ్యాక్టరీల నిర్వాహకులు కాయలు కొనలేమని చేతులెత్తే శారు. చిత్తూరు మండలం చెర్లోపల్లి ప్రాంతం లో ఉన్న ఫ్యాక్టరీ సైతం మామిడి కొనుగోలు చేయలేమని బోర్డు పెట్టేస్తున్నాయి. పూతల పట్టు, బంగారుపాళ్యం, తవణంపల్లి, కార్వేటిన గరం తదితర ప్రాంతాల్లో కూడా ఈ రకంగా ఫ్యాక్టరీలు రైతులను వేధిస్తున్నాయి.

ధరల బోర్డు పెట్టాలి కదా..?



ఇంత ఘోరం ఎప్పుడూ చూడలేదు. మా కడుపు మంట ఎవరికి చెప్పుకో వాలో తెలియడం లేదు. విధిలేని పరిస్థితుల్లో కాయలు దింపుకుంటే చాలనుకుంటున్నాము. దీన్ని అదునుగా చేసుకుని ఫ్యాక్టరీలు ఇప్పుడు ఎంతకు కొంటున్నాయో కూడా చెప్పడం లేదు. బయట మాత్రం కాయలు కొనలేం.. టోకన్లు ఇవ్వలే మని బోర్డులు పెడుతున్నారు. ధరలపై కూడా బోర్డు పెట్టాలి కదా. దీనిపై అధికారులు కూడా నోరు విప్పడం లేదు.

–గోవర్ధన్, పెనుమూరు మండలం



తుస్సు.. విద్యుత్ బస్సు

అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2021లో తిరుపతిలో కాలుష్య నియంత్రణలో భాగంగా జిల్లాకు మొట్టమొదటిగా 100 విద్యుత్ బస్సులను మంజూరు చేశారు. అయితే కూటమి సర్కారు అధికా రంలోకి వచ్చిన తర్వాత వాటి నిర్వహణ ప్రశ్నార్థకం గా మారింది. మరమ్మతుకు గురైతే ఆ సర్వీస్‌ను పట్టించుకోవడం లేదు. 10 శాతానికి పైగా సర్వీసులు మూలకు పడ్డాయని విమర్శలున్నాయి. ఈ క్రమం లోనే ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయి. మంగ ళవారం తిరుమల బైపాస్ రోడ్డులోని శ్రీనివాసం సమీపంలో ఓ విద్యుత్ సర్వీస్ నడిరోడ్డుపై ఆగిపోయింది.దీంతో బస్సులోని ప్రయాణికులు దిగి బస్సును తోయాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ క్రమం లో పెద్ద ఎత్తున ట్రాఫిక్ ఆగిపోవడంతో ప్రయాణి కులకు తిప్పలు తప్పలేదు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

పైపులైన్ పనులపై వివాదం

– కేవలం బిల్లులు చేసుకునేందుకే పనులు !



మహిళలపైకి దూసుకొస్తున్న నాగరాజ నాయుడు



గ్రామంలో ఏర్పాటు చేసిన పైపులైను

పాకాల : పైపులైను ఏర్పాటు చేయడంపై మండలంలోని దామలచెరువులో వివాదం చోటు చేసుకుంది. మంగళవారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు మసీదు వీధి, జనపవీధి, సందు వీధులలో సుమారు 1500 మంది ప్రజలు నివసిస్తున్నారు. గతంలో ఉన్న పైపులైన్‌లో నీరు బాగా వస్తుందని, ప్రస్తుతం ఏర్పాటు చేసిన పైపులైనులో నీరు సరిగ్గా రాదని చెబుతున్నా తెలుగు తమ్ముళ్లు దౌర్జన్యంగా పైపులైను ఏర్పాటు చేశారని ఆవేదన చెందారు. పైపులైను ఏర్పాటు చేయడంలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులకు నీరు రాకుండా చేయడానికి కక్ష సాధింపు చర్యలలో భాగంగానే పైపులైను ఏర్పాటు చేశారని స్థానిక మహిళలు కన్నీటి పర్యంతం అయ్యారు. ఈ విషయంపై ప్రజలకు న్యాయం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నవీన్‌ని స్థానిక మహిళలు వేడుకున్నా టీడీపీ నాయకులతో మాట్లాడుకోవాలని ఉచిత సలహా ఇచ్చారు.

టీడీపీ నేతల దౌర్జన్యం

దామలచెరువులో పైపులైను సమస్యపై బయట గ్రామాల నుంచి నాయకులను పిలిపించుకుని స్థానిక మహిళలను భయభ్రాంతులకు గురిచేశారు. నేంద్రగుంటకు చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజ నాయుడు మహిళలపైకి దూసుకొచ్చి దౌర్జన్యానికి దిగాడని ఆరోపించారు. ముస్లిం మహిళలు అని కూడా చూడకుండా వీరంగం సృష్టించాడని స్థానిక మహిళలు తెలిపారు. కేకలు వేస్తూ సుమారు 100 మంది అల్లరి మూకలతో గొడవ చేసి మహిళలకు తీవ్ర ఇబ్బందులు కలిగించారని వాపోయారు. బయట నుంచి అల్లరి మూకలు ఎందుకు వచ్చారని స్థానిక మహిళలు, మాజీ ఎంపీటీసీ పి.హసీనా ప్రశ్నించారు.

ప్రేక్షకపాత్రలో పోలీసులు

దామలచెరువులో నీటి పైపులైను సమస్యపై బయట నుంచి వచ్చిన అల్లరి మూకలు, రౌడీలు, నాయకుల దౌర్జన్యానికి పాల్పడుతున్నా పోలీసులు అడ్డుకోక పోగా ప్రేక్షకపాత్ర వహించారని స్థానిక మహిళలు ఆరోపించారు.

'ఉపాధి' అక్రమాలపై వేటు



పీడీకి వివరణ ఇస్తున్న ఉపాధి సిబ్బంది

- ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్
- రూ.3,51,585 రికవరీకి ఆదేశాలు

రేణిగుంట : గత సంవత్సర కాలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి జరిపిన సామాజిక తనిఖీల్లో ఉపాధి అక్రమాలు బయటపడ్డాయి. డ్వామా పీడీ ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేసి, రూ.3,51,585 రికవరీకి ఆదేశాలు ఇచ్చారు. రేణిగుంట మండలంలోని 19 పంచాయతీల్లో గత సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ప్రస్తుత సంవత్సరం మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై 15 రోజులుగా సామాజిక తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ రావు అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. పంచాయతీ వారిగా తనిఖీ బృందం నివేదికలను సభ దృష్టికి తీసుకొని వచ్చారు. సామాజిక తనిఖీ బృందం ఇచ్చిన నివేదిక ప్రకారం రూ.1,37,500 రికవరీ, రూ. 2,14,085 జరిమానా విధించారు. అక్రమాలకు పాల్పడిన టెక్నికల్ అసిస్టెంట్, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ టి ఎమ్ లోకేశ్వర్ రెడ్డి, ఏపీడి వరప్రసాద్,ఇన్చార్జ్ ఎంపీడీవో ప్రభురావు, గత ఎంపీడీవో విష్ణు చిరంజీవి, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ గణేష్ కుమార్, ఏపీఓ దీప, గత ఏపీవో జ్యోతి శ్రీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్ దారుణహత్య



ప్రవీణ్‌కుమార్ మృతదేహం

చిల్లకూరు : చిల్లకూరు వడ్డిపాళెంకు చెందిన ప్రవీణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం అనే ఇద్దరు పాత నేరస్తుల మధ్య నెలకొన్న కుటుంబ వివాదాల కారణంగా ప్రవీణ్‌కుమార్‌ను గొంతు కోసి హత్య చేసిన ఘటన చిల్లకూరులోని మేదర కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. చిల్లకూరు వడ్డిపాళెంకు చెందిన ప్రవీణ్‌కుమార్ (25) పాల ఆటో నడుపుతున్నాడు. మద్యానికి బానిసై చిల్లర పనులు చేస్తూ ఇటీవల నాంచారమ్మపేటలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా తేలాడు. రౌడీ షీటర్‌గా పోలీస్ రికార్డులో నమోదై ఉన్నాడు. వడ్డిపాళెం ప్రాంతానికే చెందిన సుబ్రహ్మణ్యం కూడా గతంలో నేరాలకు పాల్పడి గ్రామం వదలి శ్రీకాళహస్తి సమీపంలో ఉండే పాపానాయుడుపేటలో ఉంటున్నాడు. కొంత కాలం క్రితం సుబ్రహ్మణ్యం మేనమామ కుమార్తెను ప్రవీణ్‌కుమార్ ప్రేమించాడు. ఆ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమెకు మరొకరితో వివాహం జరిపించారు. ప్రవీణ్‌కుమార్ ఆమె వివాహానంతరం కూడా ఆమెతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలియడంతో సుబ్రహ్మణ్యం పది రోజుల క్రితం వడ్డిపాళెంకు వచ్చి ప్రవీణ్‌కుమార్‌తో వివాదానికి దిగాడు. సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు జ్యోకం చేసుకుని అతనిని అక్కడి నుంచి పంపించి వేశారు. ఆ తరువాత సుబ్రహ్మణ్యం మంగళవారం మరోసారి నేరుగా వడ్డిపాళెంకు చేరుకుని ప్రవీణ్‌కుమార్‌తో గొడవకు దిగాడు. సుబ్రహ్మణ్యం మేనమామ అతనిని అక్కడి నుంచి పంపించేశారు. అతను చిల్లకూరులో మద్యం తాగి తిరిగి వస్తున్న క్రమంలో ప్రవీణ్‌కుమార్ ఎదురు రావడంతో అతడిపై దాడి చేశాడు. ఆపై మేదర కాలనీలోకి తీసుకొచ్చి అక్కడ కత్తితో గొంతు కోశాడు. ప్రవీణ్‌కుమార్ కొంత దూరం వెళ్లి అక్కడే మృతి చెందాడు. నిందితుడు సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. గూడూరు రూరల్ సీఐ కిషోర్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో పాటుగా మృతుడి తల్లి పుష్పమ్మ నుంచి ఫిర్యాదు తీసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

పాఠశాలలకు లైబ్రరీ పుస్తకాలు



పుస్తకాలను సరఫరా చేస్తున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల: మండలంలోని అన్ని పాఠశాలలకు లైబ్రరీ పుస్తకాలు అందజేసినట్లు ఎంఈఓ బాబ్జీ అన్నారు. మంగళవారం ఎమ్మార్సీ కేంద్రంలో అన్ని పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించి, పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు విద్యార్థులతో ఒక గంట పాటు ఈ పుస్తకాలను చదివించాలని సూచించారు. మంచి పుస్తకం, మంచి స్నేహితుడితో సమానమని, విద్యార్థుల ఇంటికి పుస్తకాలను పంపి, చదివించాలని కోరారు. అలా చదివిన కథల సారాంశాలను పాఠశాలకు వచ్చిన తరువాత చెప్పించాలని, రాయించాలని కోరారు. పాఠశాలల హెచ్ఎంలు వీటిని పాఠశాల స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

13న త్త్వెకాండో చాంపియన్‌షిప్

తిరుపతి కల్చరల్ : యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జూలై 13వ తేదీన త్త్వెకాండో చాంపియన్ షిప్ నిర్వహించనున్నట్లు విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏపీ అమెచ్యూర్ త్త్వెకాండో అసోసియేషన్ గ్రాండ్ మాస్టర్ బాబురావు పర్యవేక్షణలో ఈ పోటీలు ఉంటాయని వెల్లడించారు. 5 నుంచి 17 ఏళ్ల బాల, బాలికలకు నాలుగు కేటగిరీల్లో పోటీలు ఉంటాయని వివరించారు.

తిరుపతి విద్వాంసులకు సత్కారం



విద్వాంసులను సత్కరిస్తున్న మహాదేశికన్ స్వామి

తిరుపతి సిటీ : శ్రీరంగం క్షేత్రంలో అహోబిల మఠం పీఠాధిపతులు శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికుల వారి 70వ జన్మదిన మహోత్సవం సందర్భంగా తిరుపతికి చెందిన విద్వాంసులను ఘనంగా సత్కరించారు. ఈ మేరకు జాతీయ సంస్కృత వర్సిటీ ఆగమ ప్రొఫెసర్ వేదాంతం శ్రీవిష్ణుభట్టాచార్యులుకు వైఖానసాగమ విద్వద్యుమణి, ప్రొఫెసర్ చక్రవర్తి రంగనాథన్‌కు విద్వద్యుమణి, డాక్టర్ టీఎస్ఆర్ నారాయణకు ఉభయమీమాంస రత్నం, వేదవిశ్వవిద్యాలయంలో పని చేస్తున్న డాక్టర్ సౌమ్యనారాయణ తాతాచార్యులకు విద్వద్యుమణి , డాక్టర్ కేహెచ్ రాజేష్ కుమార్‌కు పాంచరాత్ర ఆగమ విద్వద్యుమణి బిరుదులు ప్రదానం చేశారు.

తిరుచ్చిపై శ్రీకృష్ణుని విహారం



తిరుచానూరులో..

చంద్రగిరి : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయ అనుబంధగా వెలసిన శ్రీకృష్ణ స్వామివారు, అమ్మవార్లతో కలసి మంగళవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై విహరించారు. స్వామివారి జన్మనక్షత్రం రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలె నిర్వహించారు. సాయంత్రం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామివారిని తిరుచ్చిపై కొలువు దీర్చి ఊరేగించారు.



శ్రీనివాసమంగాపురంలో..

అసహనం



సెంట్రల్ బస్టాండ్‌కు నిత్యం 2,500 వరకు బస్సులు వచ్చిపోతుంటాయి. 11 మంది ఆర్టీసీ కంట్రోలర్లు విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పగటి వేళల్లో అయితే దాదాపు అర గంట వరకు వాహనాలు నిలిచిపోతున్నాయి. ఇక రాత్రి సమయాల్లో గంట వరకు బస్సులు కదలని పరిస్థితులు దాపురిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కంట్రోలర్లు సక్రమంగా పనిచేయకపోవడంతోనే సమస్యలు వస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం దీనిపై అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డీఆర్ నాయుడు మాట్లాడుతూ కంట్రోలర్లపై నిఘా పెడతామన్నారు. డ్యూటీ సమయంలో విధులకు డుమ్మా కొడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. – తిరుపతి అర్బన్

అధ్వాన్నం



ప్రతిష్టాత్మక రుయా ఆస్పత్రిలో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. పలు వార్డుల పరిసరాలు చెత్తాచెదారాలతో నిండిపోవడంపై రోగుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆస్పత్రి ప్రాంగణంలో పేరుకుపోయిన మెడికల్ వేస్ట్ ప్రమాదకరంగా తయారైంది. వాటర్ ప్లాంట్‌ల వద్ద అపరిశుభ్రత భయాందోళన రేకెత్తిస్తోంది. రోగుల వెంట వచ్చిన సహాయకులు సైతం వ్యాధుల బారిన పడే దుస్థితి దాపురిస్తోంది. పట్టించుకునేవారు లేకపోవడంతో పరిస్థితి చేయిదాటేలా మారిపోతోంది. – తిరుపతి తుడా

అవమానం.. ఆగ్రహం

తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీలో కుల వివక్ష ఘటనపై దళిత, విద్యార్థి సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు కన్నెర్ర చేశాయి. సరస్వతి పుత్రుడైన దళిత అధ్యాపకుడిని తోటి అధికారే అవమానించడం దుర్మార్గమని మండిపడ్డాయి. ఇంతటి దారుణానికి తెగబడిన అధికారిని తక్షణం విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశాయి. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశాయి.

- వెటర్నరీ వర్సిటీలో దళిత అధ్యాపకుడిపై కులవివక్ష
- వామపక్షాలు, విద్యార్థి సంఘాల ఆగ్రహం
- ప్రిన్సిపల్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్



రవివర్మతో మాట్లాడుతున్న దళిత సంఘాల నేతలు

తిరుపతి సిటీ : శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాలలో దళిత అధ్యాపకుడి పట్ల ఆ కళాశాల ప్రిన్సిపల్ వ్యవహరించిన తీరు సంచలనంగా మారింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ రవివర్మ చాంబర్లోని కుర్చీ, టేబుల్ తొలగించడం, కంప్యూటర్, ప్రింటర్ వంటి సామగ్రిని కింద పడేసిన ఘటన కలకలం రేపింది. అధ్యాపకుడు సెలవులో ఉన్న సమయంలో ప్రిన్సిపల్ కక్షపూరితంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. దళిత అధ్యాపకుడిని అవమానించడమే ఆయన ఉద్దేశమని తోటి అధ్యాపకులు, విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అగ్రకుల దురహంకారంతో ఇతరులను ఇబ్బంది పెట్టేందుకే ప్రిన్సిపల్ వ్యవహరిస్తుంటారని విమర్శిస్తున్నారు.

బాధితుడికి పరామర్శ

కులవివక్షకు గురైన ప్రొఫెసర్ రవివర్మను మంగళవారం పలు దళిత సంఘాల నేతలు పరామర్శించారు. తోటి అధ్యాపకుడిని అవమానించిన ప్రిన్సిపల్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

విచారణ కమిటీ ఏర్పాటు

ప్రొఫెసర్ రవివర్మ కుర్చీని తొలగించి అవమానించిన ఘటనకు సంబంధించి వర్సిటీ అధికారులు విచారణ కమిటీని నియమించారు. ఈ మేరకు రెండురోజులలో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. కమిటీలో డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్‌గా, వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్, ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్, డెయిరీసైన్స్ అధ్యాపకుడు సభ్యులుగా ఉండనున్నారు. కమిటీ పూర్తి స్థాయి విచారణ నిర్వహించి సమర్పించిన నివేదిక మేరకు బాధ్యులపై వర్సిటీ అధికారులు చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది.

క్షమించరాని నేరం



“విద్యాబుద్ధులు నేర్పించి కళాశాలను సక్రమంగా నడిపించాల్సిన అధికారి కుల వివక్షను చూపడం నీచమైన చర్య. ఇలాంటి వారిని విద్యా వ్యవస్థ నుంచి తొలగించాలి. ప్రిన్సిపల్ క్షమించరాని నేరానికి పాల్పడ్డారు. విద్యా వ్యవస్థలో ఇలాంటి కలుపు మొక్కలను తొలగించాలి. వెటర్నరీ యూనివర్సిటీలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతూ ఉండడం దురదృష్టకరం.
– రఘు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, జిల్లా ఉపాధ్యక్షుడు

తక్షణం చర్యలు తీసుకోవాలి



తోటి అధ్యాపకుడిని కూడా చూడకుండా డెయిరీ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ కుల వివక్షకు పాల్పడడం అమానవీయమైన ఘటన. విద్యావ్యవస్థలోనూ కులాలను ప్రేరేపించడం దురదృష్టకరం. ఇది ఏమాత్రం ఉపేక్షించదగ్గ అంశం కాదు. కుల విక్షకు కారకుడైన ప్రిన్సిపల్ను తక్షణం విధుల నుంచి తొలగించాలి. వర్సిటీ ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.
– వి.నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి

మంచిది కాదు



దళిత అధ్యాపకుడిని అవమానించిన ప్రిన్సిపల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి. చాంబర్లోని ఫర్నిచర్, కంప్యూటర్లను తొలగించడం దుర్మార్గం. ప్రిన్సిపల్ స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా వ్యవహరించడం సిగ్గుచేటు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే తక్షణం చర్యలు తీసుకోవాలి. ఇంత జరుగుతుంటే ఉన్నతాధికారులు చోద్యం చూడటం మంచిది కాదు.
– జయచంద్ర, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

అట్రాసిటీ కేసు పెట్టాలి



దళిత అధ్యాపకుడిని తీవ్రంగా అవమానించిన డెయిరీ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. ఆయన లేని సమయంలో చాంబర్లోకి చొరబడి దౌర్జన్యంగా ఫర్నిచర్, కంప్యూటర్లను తొలగించడం క్షమించరాని నేరం. దళితుడిని అవమానించాలనే దురుద్దేశంతోనే ఈ చర్యకు పాల్పడ్డారు. ప్రిన్సిపల్ స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా వ్యవహరించడం సిగ్గుచేటు.
– జూపూడి ఎజ్రా, దళిత విద్యార్థి సంఘం నేత, తిరుపతి

ప్రభుత్వం స్పందించాలి



వెటర్నరీ యూనివర్సిటీలో కుల వివక్షకు పాల్పడ్డ ప్రిన్సిపల్పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ చేపట్టాలి. ప్రిన్సిపల్ను విధుల నుంచి తొలగించాలి. బాధితులతో పాటు ప్రభుత్వం ఆయనపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయించాలి. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.
– టి.దాసు, దళిత సంఘాల ప్రతినిధి, తిరుపతి

దురదృష్టకరం



అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో దళితుడనే కారణంగా ప్రిన్సిపల్ ఇంతటి అవమానకరంగా వ్యవహరించడం దురదృష్టకరం. సభ్య సమాజం తలవంచుకునేలా ఆయన వ్యవహరించారు. విద్యా వ్యవస్థలో ఇలాంటి ఘటనలు మంచిది కాదు. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. వ్యవస్థలను మరింత పటిష్టం చేయాలి.
– లక్ష్మమ్మ, సీఐటీయూ మహిళా విభాగం అధ్యక్షులు

నోటీస్ బోర్డు

- అమావాస్య సందర్భంగా శ్రీకోదండరామ స్వామి వారి ఆలయంలో ఉదయం 8 గంటలకు సహస్ర కలశాభిషేకం, సాయంత్రం 7 గంటలకు స్వామివారికి హనుమంత వాహన సేవ.
- అన్నమయ్య సర్కిల్ సమీపంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామివారికి ఉదయం 8 గంటలకు శత కలశాభిషేకం.
- బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం వద్ద ప్రచార రథాలు ప్రారంభం.
- బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీపీఆర్ రోడ్డులోని డీబీఆర్ కల్యాణ మండపంలో ఉదయం 10.30 గంటలకు మేధావుల సదస్సు.
- నారాయణపురంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు అఖిలపక్ష పార్టీల సమావేశం.
- శ్రీవారి సేవ, పరకామణి సేవ, నవనీత సేవకు సంబంధించి ఆగస్టు కోటా టికెట్లు మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల.
- శ్రీనివాసం, విష్ణు నివాసం, అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్‌లో తిరుమలకు నడక మార్గంలో వెళ్లే భక్తులకు సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు ఉచిత దర్శనం టోకెన్ల పంపిణీ.
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 5 గంటలకు ప్రజాస్వామ్య పరిరక్షణ సదస్సు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం వెలుపల గుత్తా సుఖేందర్ రెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఉన్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

అంతా తెలుసు.. అండగా ఉంటాం



వైఎస్ జగన్‌తో చిన్నియాదవ్

తిరుపతి రూరల్ : ''అక్రమ కేసులతో చెవిరెడ్డి కుటుంబీకులను ఇబ్బంది పెడుతున్నారు. మన పార్టీ వాళ్లపై కూటమి నేతలు యథేచ్ఛగా దాడులు చేస్తున్నారు. పోలీసుల ద్వారా కార్యకర్తలను భయపెడుతున్నారు. అన్యాయంగా జైళ్లకు పంపుతున్నారు అన్నా'' అంటూ వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు చిన్నయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యలను విన్నవించారు. దీనిపై ఆయన స్పందించారు. చంద్రగిరిలో ఏం జరుగుతోందో అంతా తెలుసు.. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది.. కొంత కాలం కష్టాలు తప్పవు.. అందరికీ అండగా ఉంటాం.. అంటూ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్నియాదవ్ ఉమ్మడి జిల్లాలో పార్టీ స్థితిగతులు, బీసీల ఆదరణ తదితర అంశాలను అధినేత దృష్టికి తీసుకువచ్చారు.

ర్యాంపుల వద్ద డీపీఓ తనిఖీలు



రైతులతో మాట్లాడుతున్న డీపీఓ ప్రసాదరావు

పాకాల: మండలంలోని దామల చెరువుతో పాటు చుట్టు పక్కల నిర్వహిస్తున్న మామిడి ర్యాంపులను డీపీఓ ప్రసాదరావు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మంగళవారం స్థానికంగా ఉన్న రైతులతో మాట్లాడారు. వాస్తవ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ర్యాంపు నిర్వాహకులతో మాట్లాడి రైతులను ఇబ్బందులకు గురి చేయకూడదని, గిట్టుబాటు ధరకు కాయలను కొనుగోలు చేయాలని కోరారు. అలాగే విరివిగా మామిడి కొనుగోలుకు టోకెన్లను ఇవ్వాలన్నారు. అనంతరం సామిరెడ్డిపల్లి రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. సమస్యల పరిష్కారానికిచర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంబీపీ పీడీ సతీష్‌కుమార్, ఏఓ హరితకుమారి, ఎంపీఈఓ యామిని తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయికి 'మలబార్'

తిరుపతి కల్చరల్ : నోయిడాలో 400వ షోరూమ్ ప్రారంభించడం ద్వారా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అంతర్జాతీయ స్థాయిలో శక్తిమంతమైన బ్రాండ్‌గా నిలిచిందని తిరుపతి మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ హెడ్ రిజీష్ తెలిపారు. ప్రస్తుతం 13 దేశాలలో కార్యకలాపాలు ఉన్నాయని, త్వరలో మరో 15 దేశాల్లో విస్తరించేందుకు మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ చర్యలు చేపట్టారని వెల్లడించారు. అలాగే సామాజిక సేవా కార్యక్రమాలను సైతం ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా నిర్వహిస్తామన్నారు. కష్టమర్ల ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యమిస్తామని తెలిపారు. మలబార్ విస్తరణతో ప్రపంచ వ్యాపార రంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తామని వెల్లడించారు.

ఉర్దూతో ఉద్యోగ అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న అహ్మద్ ఖాద్రి

తిరుపతి కల్చరల్: పదో తరగతి తర్వాత ఇంటర్ ప్రవేశంలో ప్రత్యేక ఉర్దూ భాషతో కూడిన విద్యను అభ్యసించే ముస్లిం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని అంజుమన్ తరఖీ ఉర్దూ సంస్థ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి పిలుపు నిచ్చారు. మంగళవారం చిన్న బజారు వీధిలోని ఎటీఎస్ కళాశాలలో అంజుమన్ తరఖీ ఉర్దూ సంస్థ ఆధ్వర్యంలో ఉర్దూ కోర్సుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లిం విద్యార్థుల విద్యాభివృద్ధిని కాంక్షిస్తూ గత ప్రభుత్వం విద్యార్థులకు ప్రత్యేక ఉర్దూ భాష అవకాశాన్ని కల్పించిందన్నారు. అంజుమన్ తరఖీ ఉర్దూ సంస్థ 8 ఏళ్లగా జిల్లాలో ఉర్దూ భాషా అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్వీయూ సెనేట్ సభ్యుడు మహ్మద్ మోదీన భాషా, డాక్టర్ అంజాద్ అలీ బేగ్, ప్రొఫెసర్ డాక్టర్ హమీనుల్లా, హాజీ షే పరీద్ సాహెబ్ , హాజీ షేక్ మున్నీర్ సాహెబ్, మౌలాన ఇస్మాయిల్, మౌలాన సాలేహా, షేక్ దస్తగి, ఎస్.ఇనయతుల్లా, ముస్లిం విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఉమ తదితరులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ట్యాలీ ప్రైమ్ అనే అంశంపై బుధవారం నిర్వహించనున్న వర్క్‌షాపు పోస్టర్‌ను వీసీ ఉమ మంగళవారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ రుసా నాగార్జున వర్సిటీ 2.0 ప్రాజెక్ట్‌లో భాగంగా వర్క్‌షాపు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, డీన్ వాణి, ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి, ప్రొఫెసర్ కాత్యాయని పాల్గొన్నారు.

గుంతల నగరం



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అంబేద్కర్ విగ్రహం వెనుక..



ప్రకాశం పార్క్..

ప్రతిష్టాత్మక తిరునగరం గుంతలమయంగా మారిపోయింది. ఏడాదిగా తిరుపతి అభివృద్ధి కుంటుపడింది. కేవలం నాలుగు రోడ్లు.. రెండు కాలువల నిర్మాణంలో కూటమి ప్రభుత్వం నెట్టుకొచ్చేసింది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన పనులను పూర్తి చేయలేని దుస్థితి దాపురించింది. యూడీఎస్.. వాటర్ పైప్‌లైన్ల కోసం తవ్విన గుంతలను కూడా పూడ్చకపోవడంతో నగరవాసులు నానా అవస్థలు పడుతున్నారు. నూతన రహదారుల సంగతి దేముడెరుగు.. కనీసం ప్యాచ్ వర్క్‌లైనా పూర్తి చేయండి మహాప్రభో అని వేడుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు పట్టించుకోరు.. కనీసం కార్పొరేషన్ అధికారులైనా స్పందించాలని కోరుతున్నారు. – తిరుపతి తుడా



రైల్వే కాలనీలో..